క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: మరమ్మతుల కారణంగా శనివారం 11కేవీ జనప్రియ ఫీడర్ పరిధి ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ, అయోధ్యనగర్ న్యూ, ఓల్డ్, జనప్రియ మహానగర్ బ్లాకుల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని లెనిన్ నగర్ సబ్‌స్టేషన్ ఏఈ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: కందుకూరు 132 కేవీ సబ్‌సేష్టన్‌కు విద్యుత్ లైన్ వేస్తున్న కారణంగా శనివారం తుక్కుగూడ పురపాలిక పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని మహేశ్వరం ఏఈ చక్రపాణి తెలిపారు. ఇమామ్‌గూడ, హర్షగూడ, ప్రజయ్ విల్లాస్‌లో ఉదయం 8 గంటల నుంచి 11 వరకు సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

హుడాకాంప్లెక్స్‌లో..

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శనివారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విష్ణు థియేటర్ ఫీడర్ పరిధి కాలనీల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, 11కేవీ మన్సూరాబాద్ ఫీడర్ కింద మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

మీర్‌పేట: ఆదిశంకరాచార్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మీర్‌పేట శివసాయినగర్‌కాలనీ శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది. బ్రహ్మశ్రీ దేవరకొండ లక్ష్మీనరసింహ శాస్త్రి, అర్చకులు ఆదిత్య, హయగ్రీవశర్మల ఆధ్వర్యంలో లఘున్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, కల్యాణం, అర్చన, పల్లకీసేవ, ఊరేగింపుతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి, సభ్యులు సంతోష్‌రెడ్డి, వెంకట కృష్ణారావు, బాపిరాజు, గంగా రామకృష్ణ, అప్పయ్యశాస్త్రి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థినికి సన్మానం



విద్యార్థిని శ్రీలక్ష్మిని సన్మానిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

కందుకూరు: మండల పరిధి కొత్తూర్‌కు చెందిన వేముల కృష్ణ కుమార్తె శ్రీలక్ష్మి.. పదో తరగతి ఫలితాల్లో 585 మార్కులతో జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా శుక్రవారం మాజీ వైస్ ఎంపీపీ పి.కృష్ణగౌడ్, మాజీ సర్పంచ్ పి.వసంత తదితరులు బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులను సన్మానించి అభినందించారు. చదివిన పాఠశాలకు, గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తేవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. తమవంతు సహకారం ఉంటుందన్నారు. వార్డు మాజీ సభ్యులు పి.శేఖర్, ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తుక్కుగూడ: ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిందని కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. పుర కేంద్రానికి చెందిన ఆర్.లలితకు మంజూరైన రూ.60 వేల చెక్కును శుక్రవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిన్నారెడ్డి, సమత, ప్రశాంత్‌రెడ్డి, లోక్యనాయక్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

సేవలను విస్తృతం చేస్తాం

కడ్తాల్: లయన్స్‌క్లబ్ సేవలను మరింత విస్తృతం చేస్తామని లయన్ ఆఫ్ ఆమనగల్లు అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు పోతగళ్ల మహేశ్ ఆధ్వర్యంలో గోవర్ధన్‌రెడ్డితో పాటు, క్లబ్ కార్యదర్శి గంప శ్రీనివాస్ గుప్తాలను సన్మానించారు. లయన్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలతో పాటు పేద విద్యార్థులకు చేయూతనందిస్తామని పేర్కొన్నారు.

ఆరు దాటితే అంధకారమే!

- పలు కాలనీల్లో వెలగని వీధి దీపాలు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని యంత్రాంగం



సిర్లాహిల్స్‌లో వెలగని వీధి దీపం

మీర్‌పేట: ఏడాదిగా మరమ్మతులకు నోచుకోక... ఇటు కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో పలు కాలనీలు కారుచీకట్లను అలుముకున్నాయి. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రధాన కూడళ్లతో పాటు కాలనీల్లో మొత్తం 8,200 వరకు వీధి దీపాలను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలో నూతన వీధిదీపాల ఏర్పాటు, మరమ్మతుల కోసం గతంలో ఓ ప్రైవేటు ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకుంది. సదరు ఏజెన్సీ కొత్త లైట్లను ఏర్పాటు చేయడంతో పాటు పాడైపోయిన వాటికి మరమ్మతులు, చిప్స్ ఏర్పాటు చేసేవారు. గతేడాది ఒప్పంద గడువు ముగియడంతో అప్పటి నుంచి కొత్త వీధిదీపాలు లేవు, పాడైపోయినవి మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో కాలనీలు అంధకారంలో మగ్గుతున్నాయి.

ఫిర్యాదులు చేసినా దిక్కులేదు

చాలా వరకు కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదు. కొన్ని పూర్తిగా పాడైపోగా, మరికొన్ని చిన్న చిన్న రిపేర్లకు వచ్చాయి. దీనిపై మున్సిపల్ కార్యాలయంలో, సిబ్బందికి ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీలవాసులు ఆరోపిస్తున్నారు. దాదాపు ఆరు నెలల పాటు కాలనీల్లో వీధి లైట్లు వెలుగక అంధకారం అలుముకుంటోందని, ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని పలువురు పేర్కొన్నారు. ఎన్నోసార్లు విన్నవించగా మున్సిపల్ సిబ్బంది వచ్చి అడపా.. దడపా మరమ్మతులు చేసినప్పటికీ లైట్లు వెలగడం లేదని, ఇంటి పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ చిన్న చిన్న సమస్యలు పరిష్కరించడంలో యంత్రాంగం చొరవ తీసుకోవడం లేదని, కనీసం ఎప్పుడు మరమ్మతులు చేస్తారో కూడా చెప్పలేని పరిస్థితి ఏర్పడిందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదిగా ఇబ్బంది



వీధిలో దాదాపు ఏడాదిగా లైట్లు వెలగడం లేదు. సాయంత్రం ఆరు దాటితే అంధకారమే. లైటు వెలగడం లేదని ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా స్పందనే లేదు. గతంలో మరమ్మతులు చేసినా ఫలితం లేదు.

– రాజేష్, సిర్లాహిల్స్

సమస్యను పరిష్కరిస్తాం



నూతన లైట్లు, మరమ్మతులు చేపట్టేందుకు రూ.15 లక్షల నిధులను మంజూరు చేశాం. టెండర్ వేసి పది రోజుల్లోగా వీధి దీపాల సమస్యను పరిష్కరిస్తాం. అవసరమైన చోట నూతన బల్బులను ఏర్పాటు చేస్తాం.

– జ్ఞానేశ్వర్, కమిషనర్, మీర్‌పేట కార్పొరేషన్



కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో ఎమ్మెల్యే సబితారెడ్డి

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ఎమ్మెల్యే సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: ఆడబిడ్డ వివాహం కన్నవారికి భారం కావద్దని దేశంలోనే మొదటిసారిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే సబితారెడ్డి తెలిపారు. ఆర్‌కేపురం సరూర్‌నగర్ డివిజన్లకు చెందిన 99 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, కుటుంబంలో ఇద్దరికి పింఛన్, మహిళలకు నెలకు రూ.2500 అందజేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. అధికారం చేపట్టి ఏడాదిన్నర గడిచినా హామీల అమలులో విఫలమయిందని ఆరోపించారు. వెంటనే ఆయా పథకాలను అర్హులకు అందజేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ప్రకటించిన 420 హామీలు అమలు చేసేంత వరకు ప్రశ్నిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, తహసీల్దార్ వేణుగోపాల్, డిప్యూటీ కమిషనర్ సుజాత, నాయకులు అరవింద్‌శర్మ, అంకిరెడ్డి, కొండల్‌రెడ్డి, నగేష్, సందీప్, జహీర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కొత్తూరు: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కొత్తూరు జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఎమ్మె శ్రీలత అన్నారు. మండలంలోని ఎస్‌బీపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప స్వామి కామరాతి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో శ్రీలత దంపతులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. దేవాలయాలు గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని, ప్రజల్లో భక్తిని పెంపొందిస్తాయన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్‌రూరల్: ఆదర్శ మున్సిపాలిటీగా షాద్‌నగర్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు భగత్‌సింగ్‌కాలనీలో రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు కావాల్సిన తాగునీటి సౌకర్యం, అండర్ గ్రౌండ్‌డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధిదీపాల ఏర్పాటు వంటి వసతులను పూర్తి స్థాయిలో కల్పిస్తామన్నారు. అనంతరం మాజీ కౌన్సిలర్ నడికూడ సరిత ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్‌అలీఖాన్‌బాబర్, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, నాయకులు బస్వం, ఇబ్రహీం, శ్రీశైలం గౌడ్, యాదగిరియాదవ్, రాజు, మోహన్, విజయ్ కుమార్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



మొయినాబాద్‌రూరల్: ముర్తుజాగూడలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

మొయినాబాద్‌రూరల్: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై పాడి రైతులు జాగ్రత్తగా ఉండాలని మండల పశువైద్య అధికారి డాక్టర్ అహ్మద్ సూచించారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని ముర్తుజాగూడ గ్రామంలో జీవాలకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా పశువులకు ఈ నెల 13వ తేదీ వరకు ఉచిత టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు టీకాల కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సహాయక సిబ్బంది ప్రసన్నకుమార్, భీమ్‌రావు, గోరేమియా తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త

షాబాద్: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఏట్ట ఎర్రవల్లి, చందనవెల్లి, ఎల్గొండగూడ, మన్‌మర్రి లింగారెడ్డిగూడ గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

అకాల వర్షం... అపార నష్టం



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్



దేవునిబండ తండాలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

- వందల ఎకరాల్లో నేలరాలిన ధాన్యం
- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే, అధికారులు

షాద్‌నగర్: అకాలంగా కురిసిన వర్షం అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లింది. వడ్డీలకు అప్పులు తెచ్చి పంటపై పెట్టుబడి పెడితే దిగుబడి చేతికందే దశలో నేలరాలిపోయింది. ఫలితంగా అన్నదాతలు ఆందోళనలో పడ్డారు. షాద్‌నగర్‌లో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. దీంతో వందలాది ఎకరాల్లో వరి, మామిడి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. పెట్టుబడులు సైతం రాని పరిస్థితి ఉందని కర్షకులు లబోదిబోమంటున్నారు.

540 ఎకరాల్లో వరికి నష్టం

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిల్కమర్రి, బూర్గుల, కమ్మదనం, గంట్లవెల్లి, దేవునిబండ తండా, చింతగూడెం గ్రామాల్లో వడగళ్లలో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లో 659 మంది రైతులకు సంబంధించి 540 ఎకరాల్లో వరి పంట, 24 ఎకరాల్లో మామిడి, 5 ఎకరాల్లో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. సరిగ్గా దిగుబడి చేతికందే సమయంలో వరుణుడి ప్రతాపం చూపాడని రైతులు విలపిస్తున్నారు. పంట కోసే దశలో అకాలంగా కురిసిన వర్షానికి వరి పంట పూర్తిగా దెబ్బతింది. ధాన్యం మొత్తం నేలరాలిపోయింది. అదేవిధంగా పలు గ్రామాల్లో మామిడి చెట్ల కొమ్మలు విరిగిపోయాయి. కోసే దశలో ఉన్న మామిడి కాయలు నేలరాలాయి. ఫలితంగా రైతులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే వీర్లపల్లి పరిశీలన

వడగళ్ల వర్షానికి పంటలు దెబ్బతిన్న పలు గ్రామాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులను పలకరించి వారికి భరోసా కల్పించారు. పంట నష్టపోయిన కర్షకులకు పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి జాబితా సిద్ధం చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎవరూ అధైర్య పడొద్దని సూచించారు.

వివరాల సేకరణ



గంట్లవెళ్లిలో వర్షానికి నేలరాలిన ధాన్యం

మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించారు. క్షేత్రస్థాయికి వెళ్లి పొలాలను పరిశీలించి నష్ట తీవ్రతను నమోదు చేసుకున్నారు. ముఖ్యంగా వరి, మామిడి, కూరగాయల పంటలు వర్షానికి ఎక్కువగా దెబ్బతిన్నట్లు ఏఓ తెలిపారు. నివేదికను త్వరలో ఉన్నతాధికారులకు పంపిస్తామని వెల్లడించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే 'మద్దతు'

- ధాన్యానికి ధరతో పాటు బోనస్
- ఆరు వేల ఎకరాల్లో వరిసాగు
- పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు ప్రారంభం



మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం

కేశంపేట: కాంగ్రెస్ పార్టీ రైతులకు ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికల సమయంలో సన్న వడ్లకు బోనస్ అందిస్తామని హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీని హామీ మేరకు రూ.500ల బోనస్‌ను అందిస్తుంది. ప్రస్తుతం రబీ సీజన్‌లో వరి పంట కోతలకు రావడం, అక్కడక్కడ పంట దిగుబడులు కూడా వచ్చాయి. ఇప్పటి వరకు మండలంలో వడ్ల కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు తాము పండించిన పంటలను ప్రైవేట్ వ్యక్తులకు మద్దతు ధర కన్నా తక్కువ ధరకు అమ్ముకున్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దనే ఉద్దేశంతో, పంట దిగుబడిలో లాభాలను అర్జించాలనే లక్ష్యంతో ప్రభుత్వమే వడ్లను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది.

మండలంలో..

మండలంలోని 29 గ్రామాల పరిధిలో 6,020 ఎకరాల్లో రైతులు సన్నవడ్లతో పాటుగా దొడ్డువడ్లను సాగుచేశారు. మండల వ్యాప్తంగా సుమారుగా 13,244 టన్నుల వరకు వరి దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి. అధికారులు కూడా అందుకు అనుగుణంగానే ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులు సన్నవడ్లను కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే మద్దతు ధరతో పాటుగా క్వింటాల్‌కు రూ.500ల బోనస్‌ను ప్రభుత్వం అందిస్తుంది. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో వడ్లను విక్రయించేందుకు ముందుకురావాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు



సంగెంలో ధాన్యాన్ని కుప్పగా పోస్తున్న రైతు

- వడ్లలో తేమ 17శాతానికి మించకుండా చూసుకోవాల్సి ఉంటుంది.
- వడ్లలో మట్టిపెళ్లలు, రాళ్లు ఉంటే 1శాతం తరుగు
- వడ్లలో చెత్త, తాలు ఉంటే 1శాతం తరుగు
- వడ్లు చెడిపోయి ఉన్న, రంగుమారిన, మొలకెత్తిన, పురుగులు తిన్న 5 శాతం తరుగు
- వడ్లు పూర్తిస్థాయిలో లేకపోయిన, ముడుచుకొని ఉంటే 3శాతం తరుగు
- వడ్లు మిశ్రమంగా ఉంటే 6శాతం తరుగు ఉంటుంది. కాబట్టి రైతులు తగిన జాగ్రత్తలను పాటించి మద్దతు ధరను పొందాలి.

దళారులను నమ్మొద్దు



ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే రైతులకు మద్దతు ధర లభిస్తుంది. రైతులు కొత్తపేట పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కొనుగోలు కేంద్రంలో పంటలను అమ్ముకొని లాభాలు పొందాలి. దళారులకు పంటను అమ్ముకొని మోసపోవద్దు.

– గంద్ర జగదీశ్వర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్, కొత్తపేట

కులగణన చరిత్రాత్మక నిర్ణయం



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కులగణన నిర్ణయం చరిత్రాత్మకమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య అన్నారు. ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో సంబురాలు చేశారు. ఈ సందర్భంగా బాబయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులసర్వే తప్పులు తడకగా ఉందన్నారు. ప్రధాని నాయకత్వంలో సామాజిక సమానత్వం వైపు దేశంలో అడుగులు పడుతున్నాయని తెలిపారు. అందుకు ముందు మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్‌గుప్తా, పార్టీ మండల అధ్యక్షుడు సురేశ్, నాయకులు అశోక్, కుర్మయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్: దళారులను నమ్మి మోసపోకుండా.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర రూ.2320 పొందాలని డీసీసీబీ డైరెక్టర్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా రైతులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రం సింగిల్‌విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమవేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆమనగల్లు ఆధ్వర్యంలో.. కడ్తాల్ మండల కేంద్రంతో పాటు, ముద్విన్ గ్రామంలో ఈ నెల 5న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, డైరెక్టర్ వీరయ్య, సీతాల దేవేందర్, నాయకులు తదితరులు ఉన్నారు.